క్లుప్తంగా

సుస్థిర జీవనోపాధిపై శిక్షణ



రిసోర్స్ పర్సన్లకు శిక్షణనిస్తున్న మెప్మా జిల్లా సిబ్బంది

చీమకుర్తి: మెప్మా పరిధిలోని రిసోర్స్‌పర్సన్‌లకు బుధవారం చీమకుర్తిలోని మెప్మా కార్యాలయం పరిధిలో జిల్లా మెప్మా అధికారులు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చారు. స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకొని సుస్థిర జీవనోపాధిని సాధించేందుకు అవగాహన కల్పించారు. మెప్మా జిల్లా అధికారులు జయకుమార్, రాణి, చీమకుర్తి డేటా ఆపరేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

కాశీనాథునికి అభిషేకాలు

ఒంగోలు మెట్రో: పేర్నమిట్ట ఎల్లూరు డొంకలో కాశీ విశ్వనాథుని ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని చక్కగా అలంకరించి మంగళ నీరాజనాలతో భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు.

మిరపలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



పోతవరంలో మిరప పంట పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష

నాగులుప్పలపాడు: మిరప పంట సాగు చేసిన రైతులు తమ పంటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఉద్యానవనశాఖాధికారి ప్రత్యూష తెలిపారు. బుధవారం పోతవరంలో రైతులు సాగు చేసిన మిరప పంటను పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో సూక్ష్మపోషకాల లోపం లేకుండా చూసుకోవాలని దీనికి గాను పంట నాటిన 50. 65, 80, 95 రోజులకు ఒకసారి 2.5 గ్రాముల నుంచి 5 గ్రాముల సూక్ష్మ పోషక మిశ్రమం లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నేల రకాన్ని బట్టి నీటిని అందించాలని తెలిపారు. సిబ్బంది చందు కృష్ణ, శృతి, రైతులు ఉన్నారు.

రాములమ్మకు ఎస్సీ కమిషన్ చైర్మన్ నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఒంగోలు సెంట్రల్: ముంగమూరు గ్రామంలో అనారోగ్యంతో మరణించిన జై భీమ్ వాయిస్ నాయకులు కంకణాల ఆంజనేయులు తల్లి రాములమ్మకు ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ నివాళులర్పించారు. రాములమ్మ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. దళితులకు ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కంకణాల ఆంజనేయులు, బల్లికురవ వెంకట్, నాగరాజు, కొండసింగు రాజు, మిదసల ఆదినారాయణ, బద్దకోటి, చైతన్య, ప్రసాద్, క్రిష్టారావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమితి విశ్రాంత అధ్యక్షునికి ఘన నివాళి



మోపర్తి పున్నయ్య చౌదరికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు: మద్దిపాడు సమితికి దీర్ఘకాలం అధ్యక్షునిగా పని చేసిన మోపర్తి పున్నయ్య చౌదరి 22వ వర్ధంతి సందర్భంగా ఆయన శిష్యులు మద్దిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నివాళులర్పించారు. ఆయన ఈ ప్రాంతంలో చాలామందికి సహాయం చేశారని వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గట్టినేని అయ్యన్న, మజీద్,పైనం ప్రభాకర్, రామాంజనేయులు, శిష్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 44 మందిపై బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. విద్యుత్ విజిలెన్స్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల్లో విద్యుత్ చౌర్యంకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారికి రూ.2,61.500 జరిమానాగా విధించారు. అనధికారికంగా విద్యుత్‌ను వాడటం చట్ట రీత్యానేరమని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాలీబాల్ ఆడుతున్న మద్దిపాడు ఘడియపూడి జట్లు



హోరాహోరీగా తలపడుతున్న ఉప్పుగుండూరు- నిడమానూరు జట్లు



క్రికెట్ ఆడుతున్న చేజర్ల, కరవది జట్లు

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



కొత్తపట్నం హైస్కూల్‌లో వాలీబాల్ ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి



కొత్తపట్నం: రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి



ఒంగోలు రూరల్: జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీ, ఎంపీడీవో



మద్దిపాడులో టీంలను పరిచయం చేసుకుంటున్న వరకుమార్, తహసీల్దార్, ఎంపీడీఓ



అమ్మనబ్రోలులో ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

మద్దిపాడు: మండలంలోని 18 సచివాలయాలకు చెందిన టీంలకు మండల స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ గుండ్లాపల్లి, మద్దిపాడు పాఠశాలల మైదానాలను సందర్శించి ఆటల పోటీలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండలంలోని గుండ్లాపల్లి, ఇనమనమెళ్లూరు, దొడ్డవరం గ్రామాల పాఠశాలల్లో ఆరు చొప్పున సచివాలయాలను కేటాయించి అక్కడ ఉదయం పోటీలు నిర్వహించారు. అనంతరం మూడు సెంటర్‌లలో గెలిచిన సభ్యులకు మద్దిపాడులో పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ సచివాలయాల నుంచి క్రీడాకారులు రావడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో యువకులు ఆటలు ఆడుతూ సందడి చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలు గర్వకారణం

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయి లో ప్రతిభ కలిగిన యువత, క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారికి ఇష్టమైన రంగాలలో రాణించడానికి అవకాశంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడలు గర్వకారణమని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల స్థాయిలో ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభించిన ఎంపీపీ మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు అంకితభావంతో ఆడి గెలవాలని కోరారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని కద్దిసేపు వారితో కలిసి ఆటలు ఆడారు. ఉప్పుగుండూరు గ్రామంలో ఎంపీడీవో జయమణి బ్యాట్మింటన్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదాసు రాంబాబు, మున్నంగి వెంకట్రావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, బత్తుల కొండయ్య, కొలకలూరి విజయ్‌కుమార్, పీడీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు: ఆడుదాం ఆంధ్ర ఒంగోలు నగరపాలక సంస్థ స్థాయి పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒంగోలు అర్బన్‌లో ఉన్న 70 సచివాలయాలను రెండు క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్ ఏలో 35 సచివాలయాలను, కస్టర్ బీలో మిగిలిన 35 సచివాలయాలను కేటాయించారు. వీటి నుంచి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు రెండు టీంలను ఎంపిక చేస్తారు. క్లస్టర్ ఏలో ఆటల పోటీలకు గాను స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల, మినీ స్టేడియంలో ఆట స్థలాలను ఎంపిక చేశారు. క్లస్టర్ బీ కోసం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ప్రాంగణం, డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణాలను ఎంపిక చేశారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆటల పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని జేసీ, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పతాకాన్ని డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఒంగోలు నగరపాలక సంస్థ ఆడుదాం ఆంధ్రా పతాకాన్ని స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటలు ప్రతి మనిషి జీవనంలో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్యంపై మక్కువ ఇటీవల బాగా పెరిగిందని, ఈ నేపథ్యంలో వాకింగ్, వ్యాయామంతో పాటు ప్రతిరోజూ కొంతసేపు ఆటలు ఆడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శారీరక శ్రమ ద్వారా వచ్చే అలసట మనిషిని శాంతంగా ఉంచుతుందని, తద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కేవలం విద్యార్థులనే కాకుండా యువత మొత్తాన్ని ఆటల్లో భాగస్వాములను చేయాలని, ఆడుకోవాలనే ఆలోచనను యువతలో పెంపొందించాలన్నారు. గల్లీలో ఉండే ప్రతిభావంతులైన యువకుల క్రీడా సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: క్రీడలు మానసిక దృఢత్వాన్ని ఇస్తాయని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అన్నారు. రూరల్లోని కరవది జెడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడా రత్నాలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో ఆడేందుకు ఈ ఆడుదాం ఆంధ్ర పోటీలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందన్నారు. ఈ క్రీడలను ప్రోత్సహించడమే కాకుండా నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యమన్నారు. మన్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో పెద్దపీట వేసిందని ప్రస్తుతం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు గ్రామస్థాయిలో పూర్తయ్యాయని మండలస్థాయిలో నేటి నుంచి ప్రారంభమౌతున్నాయని చెప్పారు. కరవదిలో క్రికెట్ పోటీలు ప్రారంభించగా ఉలిచిలో కార్యదర్శి పి.శ్రీనివాసులు, సర్పంచ్ మురళి, గుండాయపాలెంలో సర్పంచ్ రేవు సౌజన్యారామకృష్ణ, కార్యదర్శి ఆశీర్వాదం, పేతురు పోటీలు నిర్వహించారు. సర్వేరెడ్డిపాలెంలో స్పెషల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి, కార్యదర్శి భాగ్యలక్ష్మీ పోటీలు నిర్వహించారు. కరవదిలో చేజర్ల, కరవది మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి.

కొత్తపట్నం: విద్యతో పాటు క్రీడలతోనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఒక్కో క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్‌తో ఆటను ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షత వహించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ పండగ సమయంలో ఇటువంటి ఆటలు పోటీలు పెట్టడం ఆనందకరమన్నారు. 45 రోజులు పాటు జరిగే ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఎంతో మంది సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్‌మెంటన్ ఆటలు మండల స్థాయికి 177 టీంలు వచ్చినట్లు చెప్పారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ క్రీడలు మనిషికి శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. మనం ఏదైన సాధించాలంటే క్రీడలతో ప్రారంభిస్తే ఏదైన సాధించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి క్రీడలను పోత్సహించడం ఎంతో మందికి ఉపయోగపడుతాయన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ కొత్తపట్నం మండల టీం అన్ని ఆటల్లో మొదటి బహుమతి సాధించాలని క్రీడాకారులను ఆదేశించారు. ఎంఈవో-2 పద్మావతి మాట్లాడుతూ ఐదు రకాల ఆటల్లో మొదటి బహుమతి సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ ఆటలు ఐక్యంగా ఉండేందుకు ఉపయోగపడతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలు పెట్టడం ఎంతో మందికి ఉపయోగపడతాయన్నారు. మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలు పోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం ఎంతో మంది అభినందిస్తున్నారని గుర్తు చేశారు. మండలంలో హైస్కూల్‌లో పనిచేస్తున్న 14 మంది పీడీలకు మండల పరిషత్ నిధులతో ఉచితంగా టీషర్ట్స్ పంపిణీ చేశారు. పీడీ సాయికిషోర్, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అల్లెయ్య, మణిదీప్, సూరిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.



తలపడుతున్న గద్దలగుంట సచివాలయం1, గద్దలగుంట సచివాలయం 2 జట్లు



రూరల్: జట్లుతో ఎంపీపీ, ఎంపీడీవో, కార్యదర్శి

పేస్ కాలేజీలో రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను లనార్సీ కంపెనీ నిర్వహిస్తోందన్నారు. 2023, 2024 బ్యాచ్‌లలో బీటెక్ సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఈ విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ఇంటర్వ్యూకు హాజరు కావొచ్చన్నారు. జిల్లాలోని ఏ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి అయినా తమ రెజ్యూమ్, సర్టిఫికెట్ల నకలు కాపీలు, పాస్‌పోర్టుసైజు ఫోటో , ఆధార్ నకలు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9966945242 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేస్ కాలేజీ సిబ్బందికి వైద్య పరీక్షలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ సిబ్బందికి కొనాక్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు జరిగాయి. చక్కెర వ్యాధి, రక్తపోటు, బీఎంఐ, హిమోగ్లోబిన్, పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి తగు సూచనలు చేశారు. ప్రతిరోజూ వ్యాయామం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కలిగించారు. కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి , 100 మందికి పైగా స్టాఫ్ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పేస్ కాలేజీ సిబ్బంది

టిప్పర్, కారు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు



చీమకుర్తి బైపాస్‌లో ఢీకొన్న గ్రానైట్ టిప్పర్, తుఫాన్ కారు



చీమకుర్తి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మార్కాపురం వాసులు

చీమకుర్తి: రామాయపట్నానికి రాళ్ళు తోలే గ్రానైట్ టిప్పర్, తుఫాన్ కారు ఢీకొని నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం చీమకుర్తి బైపాస్‌లో ఈ సంఘటన జరిగింది. తుఫాన్ కారు ఒంగోలు నుంచి మార్కాపురం వెళుతోంది. అదే సమయంలో రామతీర్థం నుంచి ఒంగోలు వైపు పోర్ట్‌కు రాళ్ళను తీసుకు వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో కారులో ప్రయాణించే వారిలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కావడంతో చీమకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వారిని ఒంగోలు తరలించారు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చీమకుర్తి ఎస్సై రామిరెడ్డి వివరాలను నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

ఒంగోలు టౌన్: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం బాపట్ల జిల్లా కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి వివిధ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ సిద్ధం అయింది. మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ యండీటీ, టీబీ , హెచ్‌ఐవీ కో ఆర్డినేటర్ , సీనియర్ డాట్స్ ప్లస్, టీబీ, హెచ్‌ఐవీ సూపర్‌వైజర్ , పీపీఎం కో ఆర్డినేటర్, అకౌంటెంట్ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ సిద్ధమైంది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ లోపు జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని జిల్లా అధికారి డాక్టర్ సురేష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: ఉప్పలపాడు 220/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం చీమకుర్తి, నార్త్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చీమకుర్తి ఏఈ వీ.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామతీర్థం, మర్రిచెట్లపాలెం, ఆర్.ఎల్.పురం పరిధిలోని ఇండస్ట్రియల్ పరిధిలోని పరిశ్రమల యజమానులతో పాటు ఇతర వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రశేఖర్ సంస్మరణ సభ రేపు

ఒంగోలు టౌన్: సీపీఐ నగర సహాయ కార్యదర్శి బొమ్మిశెట్టి చంద్రశేఖర్ సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగంలోని భాగ్యనర్ 3 లైన్ పార్క్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ వద్ద సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం చేసిన మహిళా క్లబ్ సభ్యులు

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం ఆరోగ్యవంతులు వారి బాధ్యతగా భావించాలని సెంట్రల్ మహిళా క్లబ్ పూర్వ అధ్యక్షురాలు గొర్రెపాటి సునీత అన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని కొత్త కూరగాయల మార్కెట వద్ద గల రెడ్‌క్రాస్ భవనంలో 16 మంది మహిళా క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. స్వయంగా సునిత రక్తదానం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సకాలంలో రక్తం దొరకక పలువురు అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన తరుణంలో కూడా రక్తదానం పట్ల పలు సందేహాలు కలిగి ఉండడం బాధకరమని చెప్పారు. రక్తదానం చేయడం వలన దాత ఆరోగ్యానికి సైతం మేలు కలుగుతుందన్నారు. కాలేజీ విద్యార్థులకు రక్తదానం పట్ల అవగాహన కలిగించేలా పాఠ్యాంశాలను రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ ఓరుగంటి సీత, కార్యదర్శి బత్తినేని అనూష రాణి, రెడ్‌క్రాస్ మహిళా విభాగం అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సునీత

కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ఒంగోలు టౌన్: గుండె జబ్బుతో బాధపడుతున్న నగరానికి చెందిన ఒక వ్యక్తికి నగరంలోని కిమ్స్ వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. బుధవారం కిమ్స్ వైద్యశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఒంగోలు నగరంలోని కేశవరాజుపేటకు చెందిన పాతూరి నాగరాజు (57) అనారోగ్యంతో బాధపడుతూ కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ పొన్నపాటి లక్ష్మణ్ రెడ్డిని సంప్రదించారు. తీవ్రమైన ఆయాసంతో మాట్లాడడానికి సైతం ఇబ్బంది పడుతున్నాడు. కాళ్లు వాసి సరిగా నడవలేని పరిస్థితిలో ఉన్నారు. కుడివైపు కవాటాన్ని మార్చాలని, ఎడమ వైపు కవాటాన్ని మరమ్మత్తు చేయాలని, గుండె రక్తనాళానికి శస్త్ర చికిత్స చేయాలని నిర్ధారించారు. గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన 5 నుంచి 6 గంటల పాటు విజయవంతంగా మల్టిపుల్ సర్జరీ చేశారు. ఈ ఆపరేషన్‌ను ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా చేయడం విశేషం. డాక్టర్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది చాలా ఆరుదైన శస్త్ర చికిత్స అని చెప్పారు. మల్టిపుల్ సర్జరీకి గతంలో ఆరోగ్యశ్రీ వర్తించేది కాదని, రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి వ్యాధులకు కూడా అనుమతి మంజూరు చేశారన్నారు. గత 8 నెలలలో సుమారు 220 బైపాస్ సర్జరీలను చేయడం, 98 శాతం సక్సస్ రేటు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయడం అభినందించదగిన విషయమని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడు, సిఓఓ కె.అంకిరెడ్డి, సూపరెంటెండెంట్ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



ఆపరేషన్ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ లక్ష్మణ్ రెడ్డి



పోటీల మొత్తం చిత్రం ఇలా..



కార్యకర్తలను ఉత్సాహ పరుస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ



పందేలు నిర్వహిస్తున్న ప్రాంతం ఇదే..

ఒంగోలు రాజసం

దర్శి: జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు బుధవారం దర్శిలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున, మరో మంత్రి ఆదిమూలపు సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో ఒంగోలు జాతి ఎడ్ల రాజసం ఉట్టిపడింది.



పోటీలను తిలకిస్తున్న ప్రముఖులు, నాయకులు



సభ ప్రాంగణంలో ఓ వైపు హాజరైన జనం